# ఆర్టీసీ సమ్మెకు సీపీఐ పూర్తి మద్దతు

## సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి

**ఉద్యమ కెరటం, అసిఫాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ జాక్ పిలుపునిచ్చిన సమ్మెకు సీపీఐ కుమురం భీం అసిఫాబాద్ జిల్లా సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ప్రభుత్వం కార్మికుల సమస్యలపై స్పందించని పక్షంలో రేపటి నుండి ప్రారంభం కానున్న ఈ సమ్మెకు సంఘీభావం తెలుపుతున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల వరకు ప్రజలకు నిరంతర సేవలు అందిస్తున్నప్పటికీ, వారికి తగిన గుర్తింపు, భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది ఉద్యోగులకు జీతాలు ఆలస్యంగా చెల్లించడం, పెండింగ్ బకాయిలు పేరుకుపోవడం మరియు పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతన సవరణ చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ విధానాల వల్ల శాశ్వత ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయని, డ్రైవర్లు మరియు కండక్టర్లు సరైన విశ్రాంతి లేక పనిభారంతో అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. అదేవిధంగా పెన్షన్, వైద్య సేవలు, బీమా వంటి ప్రాథమిక సౌకర్యాలు మెరుగుపరచాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి తగిన ఆర్థిక మద్దతు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేట్ సంస్థలకు రూట్ల ను కేటాయించడం ద్వారా ప్రజా రవాణా వ్యవస్థను ప్రభుత్వం బలహీనపరుస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే చర్చలు ప్రారంభించి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు తాళ్ల పల్లి దివాకర్ గౌడ్, సీపీఐ నాయకులు ధర్మయి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ జిల్లాలో 2 వారాలలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్ట ర్ (రెవెన్యూ) డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి లతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల తహసి ల్దారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, సెర్ప్ ఎ పి ఎం లు, వి ఓ ఎ లు, సూపర్వైజర్లతో మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో ప్రారంభమవుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో ఓటరును 2002 సంవత్సరం ఓటరు జాబితాకు మ్యాపింగ్ చేయాలని, ఇంకా మ్యాపింగ్ కానీ ఓటరు వివరాలు సేకరించి వారు ఇక్కడి నుంచి వచ్చారు వివరాలతో పోల్చుకొని భారత ఎన్నికల సంఘం వెబ్ సైట్ ద్వారా మ్యాపింగ్ చేయాలని తెలిపారు. ఈ ప్రక్రియను వేగంగా చేయడంలో పంచాయతీ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, వి ఓ ఎ లు, సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేసే మ్యాపింగ్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. ప్రతిరోజు మాపింగ్ ప్రక్రియపై పురోగతి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసి ల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, వి ఓ ఎ లు, సూపర్వైజర్లు, సెర్ప్ ఎ పి ఎం లు తదితరులు పాల్గొన్నారు.

# వేడి గాలుల పట్ల ఉపాది హామీ కూలీలు జాగ్రతలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఉపాది హామీ పనికి వచ్చే కూలీలు ఎండ తీవ్రత పట్లా జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ హరిత అన్నారు. మంగళవారం కాగజ్ నగర్ మంగలంలోని చింతగూడ గ్రామ శివారులో నిర్వహిస్తున్న ఉపాది హామీ పని ప్రదేశాన్ని స్థానిక మండల ప్రజా పరిషత్ అధికారి, ఈ జి ఎస్, ఎ పి ఓ తో కలిసి కలెక్టర్ హరిత పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామములో ఎంత మంది ఉపాది , హామీ కూలీలు వున్నారు. వారిలో ఎంత మంది కూలీలు ఉపాది పనికి హాజరౌతున్నారు, మిగత వారు రాక పోవడానికి గల కారణాలను ఈ జి ఎస్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కూలికి పని కల్పించాలన్నారు. పని ప్రదేశంలో త్రాగు నీరు, నీడా, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, తప్పని సరిగా అందుబాటులో వుండాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాది హామీ కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గత వారం నుండి రోజు రోజు ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయని వేడి గాలుల పట్ల ప్రజలు జాగ్రత్తగా వుండాలన్నారు. అనంతరం ఉపాది కూలీలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణి చేశారు.ఈ కార్యక్రమములో అధికారులు, ఈ జి ఎస్ సిబ్బంది ఉపాది హామి కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా లోకానికి కేసీఆర్ క్షమాపణ చెప్పాలి

- ఉచిత బస్ ప్రయాణంపై కేసీఆర్ వ్యాఖ్యలు సరికావు
- పథకం రద్దు చేస్తామని చెప్పే ధైర్యం ఉందా..?
- ఫ్రీ బస్ పథకంతో లక్షలాది మహిళలకు ఆర్థిక స్వావలంబన

**ఉద్యమ కెరటం, ములుగు:** ఉచిత బస్ ప్రయాణ పథకంపై మాజీ ముఖ్యమంత్రి కెసీఆర్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) తీవ్రంగా ఖండించారు. ఆయన వ్యాఖ్యలు మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు. మంగళవారం భూపాలపల్లిలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్న బహిరంగ సభలో మాట్లా డారు.ఫ్రీ బస్ పథకాన్ని "పనికిమాలినది"గా అభివర్ణించడం దొరతనానికి నిదర్శనమన్నారు. నిజంగా ఈ పథకం పనికిరాదని భావిస్తే దాన్ని రద్దు చేస్తామని ప్రకటించే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఉచిత బస్ పథకం ద్వారా లక్షలాది మహిళలు ప్రతిరోజూ ప్రయాణ ఖర్చులను ఆదా చేసుకుంటూ ఉద్యోగాలు, విద్య, ఆరోగ్య సేవలను సులభంగా పొందుతున్నారని తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ.10వేల కోట్ల మేర మహిళలకు ప్రయాణ వ్యయ భారం తగ్గిందని వివరించారు. ఇది కేవలం పథకం మాత్రమే కాకుండా మహిళల ఆర్థిక స్వావలంబనకు, సామాజిక స్వేచ్ఛకు దోహదపడే కీలక చర్య అని స్పష్టం చేశారు. సామాన్య ప్రజలకు మేలు చేస్తున్న ఈ పథకాన్ని తక్కువ చేసి చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. మహిళల మనోభావాలను దెబ్బతీసినందుకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# హిందూ సమ్మేళనం పోస్టర్ల ఆవిష్కరణ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ఈ నెల 24న (శుక్రవారం) సాయంత్రం 4 గంటలకు స్థానిక ప్రేమల గార్డెన్‌లో నిర్వహించనున్న 'హిందూ సమ్మేళనం' పోస్టర్లను రాజంపేట సర్పంచ్ బుర్స పోచయ్య, సమితి అధ్యక్షుడు భోనగిరి సతీష్ బాబు ఆవిష్కరించారు.ఈ సమ్మేళనానికి కామాఖ్య దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీ భవానీ స్వామీజీ ప్రవచనకర్తగా, ప్రముఖ సామాజిక కార్యకర్త సౌమిత్రి లక్ష్మణాచార్య ప్రధాన వక్తగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమ ప్రచారంలో భాగంగా గోవింద్‌పూర్, బూరుగూడ గ్రామాల్లో సర్పంచ్‌లు కూరట్ కార్ లక్ష్మి, మెకర్తి సంగీత–లక్ష్మణ్ కరపత్రాలను విడుదల చేశారు. హిందూ బంధువులందరూ కుటుంబ సమేతంగా తరలివచ్చి ఈ ఆధ్యాత్మిక సభను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఖండ్రే విశాల్, చరణ్, మారుతి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యువతతోనే సమాజ మార్పు సాధ్యం




**ఉద్యమ కెరటం, వరంగల్:** యువత ముందుకు వస్తేనే సమాజ మార్పు సాధ్యమవుతుందని, రాజకీయాల్లో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని హన్మకొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం అన్నారు. కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కాకతీయ యూనివర్సిటీ బాధ్యులు పున్నం పృథ్వీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాగృతి సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రాజకీయ, సామాజిక రంగాల్లో చురుకుగా పాల్గొని సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలని సూచించారు. ఈనెల 25న కల్వకుంట్ల కవిత ప్రారంభించనున్న నూతన పార్టీ కార్యక్రమానికి విద్యార్థులు హాజరై మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. అనంతరం కవితక్క పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విజయ్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# డీపీఆర్ఓ ప్రేమలతకు సన్మానం



**ఉద్యమ కెరటం, వరంగల్:** వరంగల్ జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి (డీపీఆర్ఓ)గా అదనపు బాధ్యతలు చేపట్టిన భావండ్లపల్లి ప్రేమలతను మంగళవారం పలువురు బహుజన సంఘాల నాయకులు సన్మానించారు. మంగళవారం డీపీఆర్ఓ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భీమ్ మిషన్ ఐడియాలజీ హన్మకొండ జిల్లా కన్వీనర్ దండు మోహన్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ పరిరక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ బండి అశోక్, మాల సంఘాల జేఏసీ వరంగల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ పోనుగంటి లక్ష్మీనారాయణ, కోకన్వీనర్లు వంగేటి రాజమౌళి, దండ్రే సదానందం, పోతుల కొమ్మలు, దండ్రే శ్రీనివాస్, సదువాల సారంగపాణి, దార నర్సయ్య, శేషాద్రి నాగులు తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డల కుటుంబాలకు ఆర్థిక భరోసా

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ





**ఉద్యమ కెరటం, హుజురాబాద్:** ఆడబిడ్డల కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక భరోసానిస్తుందని కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి రవీందర్ అన్నారు. ప్రజా సంక్షేమ పాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా లబ్ధిదారులకు మంగళవారం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టతరంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సకాలంలో అందజేస్తోందని అన్నారు. ఈ పథకాల ద్వారా ఆడబిడ్డల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆడబిడ్డల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఆయనకు అందరూ ఆశీర్వాదాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రమాదాలు జరుగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ హరిత**



**ఉద్యమ కెరటం , కాగజ్ నగర్:** పరిశ్రమలలో ప్రమాదాలు జరుగకుండా పరిశ్రమల యజమనులు రక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరిత అన్నారు. మంగళవారం కాగజ్ నగర్ పట్టణం లోని సిర్పూర్ పేపర్ పరిశ్రమను ప్రజపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పరిశ్రమల రక్షణ పై ఏర్పాటు చేసిన మాక్ డ్రిల్ కార్యక్రమము లో నిజామాబాద్ డిప్యూటి చీఫ్ ఇన్స్పెక్టర్ సి హెచ్ లక్ష్మి కుమారి ఎస్ పి ఎం వైస్ ప్రెసిడెంట్ ఎ కే మిశ్రా తో కలిసి కలెక్టర్ హరిత పాల్గొన్నారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్మాగారాలలో బద్రత ప్రమాణం పాటిస్తూ ప్రమదళ్ళు జరగకుండా యజమన్యులు అప్రమత్తంగా ఉండాలని పరిశ్రమలలో పని చేసే కార్మికుల భద్రత దృష్ట్యా ప్రమాదాలు జరుగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అకస్మాత్తు ప్రమాదాలు సంబవిస్తే వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలలో నిలువ వుండే క్లోరిన్, యాసిడ్ వంటి విషపూరీత పదార్ధాలు లికేజి కాకుండా కట్టు దిట్ట మైన చర్యలు తీసుకోవాలన్నారు. టెక్నికల్ నిపుణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమములో ఎస్. పి. ఎం. పరిశ్రమ జనరల్ మేనేజర్ ఎస్ ఎం గిరి, సేఫ్టి మేనేజర్ ఆర్ శ్రీనివాస్, కమర్షియల్ జి యం అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాగజ్ నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయములో జనాభ గణన ప్రక్రియలో భాగంగా ఇళ్ల గణన కార్యక్రమములో విధులు నిర్వహించే ఎన్యూమరేటర్లు, సూపెర్ వైజర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హరిత పాల్గొన్నారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల గణన పై మాస్టర్ ట్రైనర్లు చెప్పే ప్రతి అంశాన్ని శ్రద్దగా విని నోట్ చేసుకోవాలన్నారు. ఏమైనా అంశాల పై అర్ధం కాకపోతే శిక్షకుల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ఇళ్ల గణన కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమములో గణాంక అధికారి గురువయ్య, మాస్టర్ ట్రైనర్లు ఉషన్న,ఎన్యూమరేటర్లు, సూపెర్ వైజర్లు, పాల్గొన్నారు.

# టివిజెఏ పనితీరు అభినందనీయం

- **మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి**



**ఉద్యమ కెరటం, హైదరాబాద్ :** వీడియో జర్నలిస్టుల సంక్షేమం కోసం, తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రెండు రోజుల క్రితం జరిగిన టివిజెఏ కార్యవర్గ ఎన్నికల్లో గెలుపొందిన ఆఫీస్ బేరర్లకు శ్రీనివాస్ రెడ్డి చేతులమీదుగా గెలుపు పత్రాలను మంగళవారం నాడు బషీర్ బాగ్ లోని దేశోద్దారక భవన్ లో అందించారు. ఈ సందర్బంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఆయా న్యూస్ ఛానెల్స్ లో పనిచే స్తున్న వందలాది వీడియో జర్నలిస్టులను ఏకం చేసి, అసోసియేషన్ కార్యకలాపాలను సమర్ధవంతంగా నిర్వ హించడం ప్రశంసనీయమన్నారు. వీడియో జర్నలిస్టుల సంక్షేమం కోసం తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. మీడియా రంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగునంగా, వీడియో జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు వృత్తి గౌరవాన్ని పెంపొందించడానికి మీడియా అకాడమీ చర్యలు చేపడుతుందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ మాట్లాడుతూ, 740మంది సభ్యులతో కొనసాగుతున్న వీడియో జర్నలిస్టుల అసోసియేషన్ తమ సంఘానికి అనుబంధంగా పనిచేయడం ఎంతో సంతోషం కలిగిస్తుందన్నారు. ఇంతమంది వీడియో జర్నలిస్టులకు ప్రాతినిద్యం వహిస్తున్న ఈ అసోసియేషన్, దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఆయా కమిటీల్లో వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ కు ప్రాతినిద్యం దక్కేలా తాము కృషి చేస్తున్నట్లు విరాహత్ అలీ స్పష్టం చేసారు. అలాగే ఫ్రీలాన్స్ వీడియో జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డు ల మంజూరీ కోసం టీయుడబ్ల్యూజే కృషి చేస్తుందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎన్నికల రిటర్న్ అధికారి మోహన్ రాజ్ పిల్లయ్, తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, టివిజెఏ తాజా మాజీ అధ్యక్షుడు, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు వనం నాగరాజు, అసోసియేషన్ నూతన అధ్యక్షుడు హరీష్ నందూరి, ఉపాధ్యక్షుడు పి. ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.సన్నీ, సహాయ కార్యదర్శి వి.జనార్దన్ రెడ్డి, కోశాధికారి ఆర్. విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా నూతన కార్యవర్గాన్ని మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి టీయుడబ్ల్యూజే అధ్యక్షులు విరాహత్ అలీలు సత్కరించారు.

# ఆలయాల అభివృద్ధి కి కృషి

- **మల్లూరు హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి దర్శించిన మంత్రి సీతక్క**

**ఉద్యమ కెరటం, ములుగు:** ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. మంగపేట మండలం మల్లూరు గ్రామంలోని శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి వారిని మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్తో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్బంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం ప్రార్థించినట్లు చెప్పారు.మల్లూరు ఆలయం రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, పంచాయతీరాజ్ స్టేట్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, ఆలయ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, మండల పార్టీ సీనియర్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి




**ఉద్యమ కెరటం, హన్మకొండ:** కేంద్ర ప్రభుత్వం 33 శాతం మహిళా రిజర్వేషన్ను ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని ఏఐఎఫ్డీఎస్ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి డిమాండ్ చేశారు. మంగళవారం హన్మకొండ పట్టణం నుంచి విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం భారత రాజ్యాంగంలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని బలహీనపరిచే విధంగా చర్యలు తీసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. అశాస్త్రీయ పద్ధతిలో డిలిమిటేషన్ చేపట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. 2023లో తీసుకువచ్చిన 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును బేషరతుగా అమలు చేయాల్సిందిపోయి డిలిమిటేషన్కు ముడిపెట్టడం సరికాదన్నారు. మహిళల పట్ల నిజంగా గౌరవం ఉంటే ఎలాంటి కుంటిసాకులు లేకుండా మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దక్షిణ భారత రాష్ట్రాలకు నష్టం కలిగించే విధంగా డిలిమిటేషన్ తీసుకురావడం సమంజసం కాదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి దేశ ప్రజల మనోభావాలకు అనుగుణంగా విధానాలు అమలు చేయాలని కోరారు.

# సాంప్రదాయాలు గ్రామీణ సమాజాన్ని ఏకం చేస్తాయి

- **చెరువుముందు తండాలో బొడ్రాయి ప్రతిష్టా పన మహోత్సవం**
- **ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**ఉద్యమ కెరటం, వరంగల్:** సాంప్రదాయాలు గ్రామీణ సమాజాన్ని ఏకం చేస్తాయని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం పరిధిలోని చెరువుముందు తండా (సీకే తండా)లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవానికి మంగళవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తండా వాసులు మంగళ హారతులు, డోలు వాయిద్యాలు, పూలమాలలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని తండా ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలు సమాజాన్ని ఏకం చేసే శక్తిగా నిలుస్తాయని అన్నారు. బొడ్రాయి ప్రతిష్టాపన వంటి కార్యక్రమాలు మన సంస్కృతి, వారసత్వానికి ప్రతీకలని పేర్కొన్నారు. తండా ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. తాగునీరు, రహదారులు, విద్య, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన కుటుంబాలకు చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కలెక్టర్ను కలిసిన నూతన ఆర్డీ ఓ



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీఓ)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పి.జగదీశ్వర్ రావు జిల్లా కలెక్టర్ రాజర్షిషాను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ కార్యకలాపాలను అత్యంత సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికీ చేరేలా పారదర్శకంగా అమలు చేయాలని ఆదేశించారు. అలాగే కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ, వారికి మెరుగైన సేవలు అందించే దిశగా నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ విభాగపు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రణాళికబద్దంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ(ఇచ్చోడ):** విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళికబద్దంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఇచ్చోడ మండల గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన 'స్టూడెంట్ టాలెంట్ ఫెస్ట్'కార్యక్రమానికి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది ఇంటర్ ఫలితాల్లో 91 శాతం ఉత్తీర్ణత సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న 'స్టార్ 50' వంటి శిక్షణలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాల ఆధునీకరణ, దెబ్బతిన్న ప్రహరీ గోడ నిర్మాణం కోసం రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వీటితో త్వరలోనే మౌలిక వసతుల పనులు చేపడతామని తెలిపారు. విద్యార్థులు ఎండల పట్ల జాగ్రత్తగా ఉంటూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. అనంతరం అధికారులతో కలిసి పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల, జిల్లా స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# డిగ్రీలో ప్రవేశాల కోసం దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్




**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కాగజ్నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీలో ప్రవేశాలు పొందే విద్యార్థుల కోసం జిల్లా స్థాయి దోస్త్ సహాయక కేంద్రాన్ని(హెల్ప్ లైన్ సెంటర్) ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీ ప్రవేశాల విషయంలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఏర్పడితే కళాశాలలోని సహాయక కేంద్ర సిబ్బందిని సంప్రదించి పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం విద్యార్థులు సెల్: 7013607011, 9440194179 లపై సంప్రదించాలని కోరారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని రేచినీ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తాండూర్ ఐబీకి చెందిన కొడిప్యాక కరుణశ్రీ (50) అనే మహిళ మృతి చెందింది. స్థానికుల వివరాల ప్రకారం.. బెల్లంపల్లిలో జరిగిన ఒక ఫంక్షన్కు వెళ్లి తిరిగి తాండూర్ ఐబీకి కారులో వస్తుండగా సోమవారం రాత్రి సుమారు 11గంటల సమయంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కరుణశ్రీ తలకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటన స్థలంలోనే మృతిచెందింది. అదే కారులో ఉన్న డ్రైవర్ సంతోష్తో పాటు మరో ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా, వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తాండూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

